సాక్షి
జోగులాంబ గద్వాల

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



బ్యాడ్మింటన్ పోటీలు

మహబూబ్‌నగర్‌లోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

-8లో ▸



లక్ష్యానికి చేరువలో..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో చేపడుతున్న విద్యుదుత్పత్తి లక్ష్యానికి చేరువలో ఉంది.

-8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.8/22.1

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అందరికీ 'సర్వేపల్లి' ఆదర్శం



గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలో గురుపూజోత్సవ కార్యాక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, క్రీడా సంఘాల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా దివ్యాంగుల సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని దివ్యాంగుల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు చంటి మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఎనలేని సేవలందించిన సర్వేపల్లి రాధాకృష్ణ అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఏ రంగంలో అయిన ప్రతి ఒక్కరి గురువు ఉంటారని చెప్పారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం సముద్రమట్టానికి పైన 1,021 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 920 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదని చెప్పారు. ఇదిలా ఉండగా.. జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 872 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

ముగిసిన వట్టెం వెంకన్న పవిత్రోత్సవాలు



బిజినేపల్లి: మండలంలోని వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఆలయ అర్చక బృందం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు స్వామి వారికి అభిషేకాలు, మహాపూర్ణాహుతి, పవిత్ర మాలధారణ వంటివి జరిపించారు. చివరిరోజు నిర్వహించిన స్వామివారి పవిత్రోత్సవాల కార్యక్రమానికి వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాప్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అనంత నర్సింహారెడ్డి, కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు. పవిత్రోత్సవాలను తిలకించడానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

మైక్రో బ్రూవరీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 25వ తేదీ వరకు అవకాశం



మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో మైక్రో బ్రూవరీ(చిన్న తరహా బీరు పరిశ్రమ) ఏర్పాటు చేసుకోవడానికి తెలంగాణ ఆబ్కారీ శాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ డీసీ విజయ భాస్కర్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిసారి జిల్లాకేంద్రంలో కార్పొరేషన్‌లలో బీరు తయారు చేసి విక్రయాలు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మైక్రో బ్రూవరీ ఏర్పాటుకు వెయ్యి చదరపు మీటర్లతో కూడిన ప్రాంగణం అవసరం ఉంటుందని, దీనికి రూ.1లక్ష డీడీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దీని ద్వారా బీరు తయారు చేసి అక్కడే విక్రయాలు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తుతో పాటు రూ.1లక్ష డీడీ, ఆధార్ కార్డు, ప్రస్తుతం బార్, క్లబ్, రెస్టారెంట్ ఉంటే వాటి లైసెన్స్ జిరాక్స్ జత చేసి ఈ నెల 25లోగా వరకు ఎనుగొండలోని డీసీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎంపికైనా వారు 180 రోజుల్లో చిన్న తరహా బీరు పరిశ్రమ ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని, లైసెన్స్ ఫీజు రూ.5 లక్షలతో పాటు ఎక్సైజ్ డ్యూటీ చెల్లించాలని కోరారు. ఇతర వివరాలకు 87126 58872 సంప్రదించాలని సూచించారు.



బీచుపల్లిలో నిమజ్జనం ప్రాంతాన్ని పరిశీలించి సూచనలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



నిమజ్జనం అవుతున్న గణపయ్య



శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువకులు

కృష్ణమ్మ ఒడికి గణనాథుడు..

- బీచుపల్లికి అధిక సంఖ్యలో తరలివచ్చిన విగ్రహాలు
- పోలీసుల పటిష్ట ఏర్పాట్లు

ఎర్రవల్లి: గణేష్ ఉత్సవాలలో భాగంగా గణనాథులను శోభాయాత్రగా తరలించి బీచుపల్లి కృష్ణానదిలో భక్తులు నిమజ్జనం చేశారు. ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో నుంచి గణనాథులను తొమ్మిది రోజుల పాటు మండపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం తొమ్మిదో రోజు కావడంతో నిమజ్జనం కోసం మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు, అన్నదానాలు నిర్వహించారు. సాయంత్రం నుంచి లడ్డూ వేలం పాట నిర్వహించగా పలువురు పోటాపోటీగా వేలం పాడి కైవసం చేసుకున్నారు. అనంతరం పిల్లలు, పెద్దలు భజనలు, నృత్యాలు చేసుకుంటూ పురవీధుల గుండా గణనాథున్ని వాహనాలలో ఊరేగిస్తూ రాత్రి బీచుపల్లి కృష్ణా నదికి చేరుకొన్నారు. క్రేన్ సహాయంతో అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు దాదాపు 200 గణనాథులను కృష్ణా నదిలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం ప్రాంతాన్ని అర్ధరాత్రి ఎస్పీ తోట శ్రీనివాసరావు, డీఎస్పీ మొగులయ్య, సిఐ రవిబాబుతో కలిసి సందర్శించారు. బీచుపల్లి పరిసర ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెవెన్యూ, మత్స్యశాఖ, విద్యుత్, వైద్యశాఖ అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్‌జామ్ కాకుండా 40మంది సిబ్బందితో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని ఎస్ఐ రవి నాయక్‌కు ఎస్పీ ఆదేశించారు.

రాయితీ యంత్రం.. రైతుకు ఊతం



- రూ. 2.13 కోట్ల విలువ చేసే 2,703 వ్యవసాయ పరికరాలు, యంత్రాలు మంజూరు
- రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు
- మండల, జిల్లాస్థాయి కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక

గద్వాల వ్యవసాయం: పంట పెట్టుబడులు ఏటేటా పెరుగుతున్నాయి. వీటిని కాస్తైనా తగ్గించేందుకు ఆధునిక యంత్రాలను కొనుగోలు చేయలేని పరిస్థితిలో సన్న, చిన్నకారు రైతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 40 నుంచి 50 శాతం సబ్సిడీపై రూ.2.13 కోట్లు విలువ చేసే 2,703 వ్యవసాయ పరికరాలు, యంత్రాలు అందజేయనుంది.

పెరుగుతున్న పెట్టుబడులు

వ్యవసాయం రైతులకు భారంగా మారుతోంది. ప్రధానంగా పంట పెట్టుబడులు పెరుగుతున్నాయి. రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన లాంటి పథకాలు పెట్టుబడికి సాయం అందిస్తున్నప్పటికీ వాటితో అవసరాలు పూర్తిగా తీరడం లేదు. పంట పెట్టుబడుల్లో భాగంగా కూలీలకు ఎక్కువగా చెల్లించాల్సి వస్తోంది. కూలీలతో కాకుండా ఆధునిక యంత్రాలతో చాలా పనులు చేయవచ్చు. కానీ చాలామంది సన్న, చిన్నకారు రైతులు ఆర్థికపరమైన కారణాల వల్ల వాటిని కొనలేకపోతున్నారు. ట్రాక్టర్లు లాంటివి కాపోయిన నాగలి, గుంటుక, గొర్రు, చేతిపంపులు, పవర్ స్ప్రేయర్లు ఇలాంటివి కూడా చాలా మంది రైతులు కొనలేని పరిస్థితుల్లో ఉన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా..

2017 వరకు అప్పటి ప్రభుత్వాలు వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 40నుంచి 50శాతం సబ్సిడీపై పలు రకాల పనిముట్లు, యంత్రాలను రైతులకు అందజేసింది. ఆ తర్వాత బడ్జెట్ లేదనే సాకుతో వ్యవసాయ యాంత్రీకరణ కింద అందజేయడం మానుకున్నారు. ఎట్టకేలకు ఈ ప్రభుత్వం మళ్లీ సబ్సిడీపై సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ పరికరాలు, యంత్రాలను మంజూరు చేయడానికి సిద్ధపడింది. ఇందులో భాగంగా జిల్లాకు రూ.2.13 కోట్లు విలువ చేసే 2,703 పరికరాలు, యంత్రాలు ఉన్నాయి. బ్యాటరీ, పవర్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, కేజీవీల్స్, రోటవేటర్లు తదితరమైనవి ఇందులో ఉన్నాయి.

జిల్లాకు మంజూరైన యూనిట్ల వివరాలు

పరికరం పేరు	మొత్తం యూనిట్లు	విలువ (రూ.లక్షల్లో)
బ్యాటరీ స్ప్రేయర్లు	1,968	19.68
పవర్ స్ప్రేయర్లు	396	39.60
బండ్ ఫార్మర్	9	01.35
కల్టివేటర్, కేజీవీల్	131	26.02
రోటోవేటర్స్	103	51.50
సీడ్‌కం ఫర్టిలైజర్ డ్రిల్	18	05.40
బ్రష్‌కట్టర్	25	08.75
పవర్ టిల్లర్	17	17.00
పవర్ వీడర్స్	17	17.00
స్ట్రాబేలర్స్	19	38.00

పారదర్శకంగా ఎంపిక చేస్తాం



జిల్లాకు మంజూరైన యూనిట్ల మేరకు అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. పారదర్శకంగా రైతులను ఎంపిక చేస్తాం. ప్రభుత్వం సబ్సిడీపై అందజేయనున్న ఈ వ్యవసాయ పరికరాలు, యంత్రాలతో రైతులు కూలీల ఖర్చును అధిగమించడానికి దోహదం చేస్తుంది.

– సక్రియానాయక్, డీఏఓ

ప్రయోజనం

నడిగడ్డ వ్యవసాయ ఆధారిత జిల్లా. జిల్లాలో 1,76,980 మంది రైతులు ఉండగా ఇందులో 90శాతం మంది సన్న, చిన్న కారు రైతులే. వీరంతా ఏటా పెట్టుబడి పెట్టడంలో భాగంగా సాగు కష్టాలు ఎదుర్కొంటారు. చిన్న, చిన్న పరికరాలు, యంత్రాలు కూడా కొనుగోలు చేయడానికి ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతుంటారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా వచ్చిన ఈ అవకాశం వారికి కొంత ప్రయోజనం చేసూరుస్తుంది.

కమిటీల ద్వారా ఎంపిక

5 ఎకరాల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతంపై, మిగతా వారికి 40శాతంపై పరికరాలు అందజేయనున్నారు. ఇందుకోసం రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ పత్రాలను దరఖాస్తు ఫారం జతపర్చి ఆయా మండలాల్లోని మండల వ్యవసాయ అధికారికి అందించాలి. మండల, జిల్లా స్థాయి కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేస్తాయి. మండల స్థాయి కమిటీలో వ్యవసాయ ఏఓ, తహసీల్దార్, ఎంపీడీఓ ఉంటారు, జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఏఓ, ఆగ్రోస్, అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు సభ్యులుగా ఉంటారు. కాగా రూ.లక్షలోపు విలువ చేసే పరికరాలు మండల స్థాయి కమిటీ, రూ.లక్షకు పైగా ఉన్న పరికరాలు, యంత్రాలకు జిల్లా కమిటీ ఎంపిక చేయనుంది. ఇదిలా ఉంటే జిల్లాలో మూడురోజుల క్రితం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయ్యింది.



మల్దకల్‌లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ రాజశేఖర్

నేడు జిల్లాకు మంత్రుల రాక



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎస్పీ శ్రీనివాస్‌రావు

- లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ
- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: ఈనెల 6వ తేదీన గద్వాలకు మంత్రులు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టూరిజం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రానున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. శుక్రవారం ఆయన ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ శ్రీనివాస్‌రావుతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమాల శివారులో రూ.85కోట్లతో నిర్మించిన 1275డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో 987 ఇళ్లను ఇదివరకే లబ్ధిదారులకే కేటాయించడం జరిగిందని వీటిని ఈనెల 6వ తేదీన లబ్ధిదారులకు అందిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగనున్నందున అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా అన్ని బ్లాకులో తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం, డ్రైనేజీ వ్యవస్థ వంటివి ఎక్కడైనా మిగిలిపోయిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా పటిష్ఠమైన పోలీసుబందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం వారు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి డబుల్‌బెడ్రూం ఇళ్లను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, హౌసింగ్‌పీడీ శ్రీనివాస్‌రావు, ఆర్డీవో అలివేలు, డీఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి కొత్త కాలేజీలు



లా కళాశాలలో అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాలల ముస్తాబు

- పూర్తయిన తరగతి గదుల నిర్మాణం, డ్యూయెల్ డెస్కుల ఏర్పాటు
- ఆయా కోర్సుల్లో ఇప్పటికే పూర్తయిన అడ్మిషన్ల ప్రక్రియ
- 'లా'లో 45 మంది, ఇంజినీరింగ్‌లో 191 మంది చేరిక
- ఓరియంటేషన్ క్లాస్‌లు పూర్తి.. త్వరలో తరగతులు ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం పాలమూరు యూనివర్సిటీలో ఈ విద్యా సంవత్సరం నుంచే లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో పీయూలోని అకాడమిక్ భవనం పైభాగంలో ఎడమ వైపు ఉన్న తరగతి గదులు ఇంజినీరింగ్, కుడి వైపు ఉన్న గదులు లా కళాశాల విద్యార్థులకు కేటాయించారు. కాగా ఆరు నెలల క్రితమే గదుల నిర్మాణం ప్రారంభించగా ఇటీవల పూర్తయ్యాయి. వీటిలో విద్యార్థులకు అవసరమైన డ్యూయెల్ డెస్కులు, టేబుళ్లు తదితర వాటిని అధికారులు ఏర్పాటు చేశారు. ఆయా కోర్సుల్లో కలిపి మొత్తం 191 మంది విద్యార్థులను ప్రభుత్వం అలాట్ చేసింది. ఇంజినీంగ్‌లో చేరిన విద్యార్థులకు కళాశాలతోపాటు హాస్టల్‌లో చేరేందుకు అధికారులు అవకాశం కల్పించారు. వీరికి కృష్ణవేణి బాలికల హాస్టల్ కొత్త భవనంలో వసతి ఏర్పాటు చేశారు. అలాగే వీరు కళాశాలలో ఎలా ఉండాలి.. ఎలా నడుచుకోవాలని అనే అంశాలపై ఓరియంటేషన్ కార్యక్రమాలు సైతం నిర్వహించారు. త్వరలో రెండు కళాశాలల తరగతులు ప్రారంభించనున్నారు.

సిబ్బంది నియామకం..

లా, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు తరగతులు బోధించేందుకు గెస్టు ఫ్యాకల్టీని అధికారులు నియమించారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగంలో మొత్తం మూడు గ్రూప్‌లకు సంబంధించి 11 మందిని అధ్యాపకులకు ఇంటర్వ్యూలు, డెమో చేపట్టిన తర్వాత నియమించారు. అలాగే లా కళాశాలకు సంబంధించి 6 పోస్టుల భర్తీకి బుధవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 6 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే 10 మందిని షార్ట్‌లిస్టు చేశారు. త్వరలోనే ఈ ఫలితాలు వెలువడనున్నాయి. వీటితోపాటు లా, ఇంజినీరింగ్ కళాశాలలకు నాన్ టీచింగ్ సిబ్బందిని వివిధ డిపార్ట్‌మెంట్లలో ఉన్నవారిని సర్దుబాటు చేయనున్నారు. మొత్తం 6 మందిని కేటాయించనున్నట్లు తెలుస్తుంది. ఇక లా విద్యార్థులు మొత్తం 120 మంది లాసెట్ ద్వారా ఎంపికై, ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ పెట్టుకున్న వారి లిస్టును ప్రభుత్వం పీయూకు పంపించింది. 45 విద్యార్థుల బుధవారం సాయంత్రం నాటికి దరఖాస్తు చేసుకోగా.. మిగతా వారికి గురువారం వరకు పీయూలో చేరేందుకు అధికారులు అవకాశం కల్పించారు.

అధునాతన సౌకర్యాలతో..

పీయూలో నూతనంగా ప్రారంభించనున్న లా, ఇంజినీరింగ్ కళాశాలల్లో అన్ని వసతులు కల్పించి ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నాం. ఇంజినీరింగ్‌లో గదులతోపాటు డ్యూయెల్ డెస్కుల్, టేబుల్స్ అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. త్వరలో తరగతులు కూడా ప్రారంభం కానున్నాయి. రెండు కళాశాలలకు సంబంధించి సిబ్బంది నియామకం ప్రక్రియ సైతం పూర్తయ్యింది.


– శ్రీనివాస్, వైస్ చాన్స్‌లర్, పీయూ

అడ్మిషన్లు కొనసాగుతున్నాయి

పీయూ లా కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. 120 మందితో పీయూను ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకున్నారు. ఇప్పటికే 45 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. విద్యార్థులకు కళాశాలలో పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం.

– మాళవి, లా కళాశాల ప్రిన్సిపాల్

శాంతి పథం.. ఇస్లాం మార్గం



గద్వాలలో మిలాద్-ఉన్-నబి వేడుకల్లో ముస్లిం మత పెద్దలు

- జిల్లాలో ఘనంగా మిలాద్-ఉన్-నబి వేడుకలు

గద్వాలటౌన్: ఇస్లాం మత స్థాపకుడు మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు మిలాద్-ఉన్-నబి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్థానిక షాదీ ఖానలో వేడుకలు చేపట్టారు. గురువారం రాత్రి స్థానిక బీసీ కాలనీలోని మస్జిద్-ఏ-అన్వర్‌లో ఇషా నమాజ్ నిర్వహించారు. ఖురాన్ పఠనంతో జాగరణ వేడుకలు నిర్వహించారు. మిలాద్-ఉన్-నబి సందేశాలతో రాత్రంతా ముస్లింలు మసీదులలో గడిపి ప్రవక్త జన్మదినాన్ని స్మరించారు. మత పెద్దలు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. మిలాద్-ఉన్-నబి వేడుకలను పురస్కరించుకొని పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు అన్నదానాలు నిర్వహించారు.

మహ్మద్ ప్రవక్త శాంతిదూత...

ఇస్లాం అంటే శాంతి అని, మహమ్మద్ ప్రవక్త శాంతిదూత అని పలువురు మత పెద్దలు మౌలాన సయ్యద్ షా సుల్తాన మొహినుద్దీన్ ఖాద్రి, మౌలాన మహ్మద్ షాకీర్ అహ్మద్ కౌసర్ ఖాద్రి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక షాదిఖానాలో చేపట్టిన కార్యక్రమంలో మత పెద్దలు మాట్లాడారు. ఆచారమేదైనా, మతమేదైనా మంచితనాన్ని ప్రవక్త కాంక్షించారన్నారు. అనంతరం శాంతి సందేశాన్ని ఇచ్చారు. మహమ్మద్ ప్రవక్త మార్గంలో నడవడమే ఇస్లాం అని పేర్కొన్నారు. విశ్వంలోని సకల మానవాళిలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను, చీకట్లను తొలగించి వారి జీవితాలను కాంతిమయం చేసి సన్మార్గంలో నడిపించడానికి మహమ్మద్ ప్రవక్త కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్కజి మిలాద్ కమిటీ అధ్యక్షుడు షఫివుల్లా, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నభాషా, అతికూర్ రహమాన్, సిరాజుద్దీన్, రహెమతుల్లా, జానిమియ్యా, రఫీ, అల్తాఫ్, షకీల్, దౌలత్, సయ్యద్ ఫిరోజ్‌పాషా, సయ్యద్ ఫారూక్‌పాషా, చాంద్‌పాషా, సయ్యద్ ఫయ్యాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఊరట

గద్వాలటౌన్: వినాయక చవితి, దసరా తదితర పండుగల కానుకగా కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించడం సామాన్యులకు ఊరట కలిగించే విషయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి పేర్కొన్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపును పురస్కరించుకుని బీజేపీ నాయకులు శుక్రవారం స్థానిక వైఎస్సార్ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జీఎస్టీ రేట్ల తగ్గింపు ద్వారా సామాన్యులు, రైతులు, విద్యార్థులు, మహిళలకు నేరుగా ప్రయోజనం కలుగుతోందన్నారు. జీఎస్టీ శ్లాబ్‌లను సులభతరం చేసి చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని హర్షం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరచడం, ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని చెప్పారు. మోదీ దార్శనికతతో దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అఫ్సర్‌పాష, రవికుమార్, బండల వెంకట్రాములు, శ్యామ్‌రావు, కేకే రెడ్డి, రమాదేవి, బండల పద్మావతి, జయశ్రీ పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


శంకర్(ఫైల్)

మిడ్జిల్: మండలంలోని దోనూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి గొరిగే వెంకటయ్య, బాలమ్మ, కుమారుడు గొరిగె శంకర్(20) శుక్రవారం రాత్రి తల్లిదండ్రులు, స్నేహితులతో కలిసి వినాయక నిమజ్జనంలో పాల్గొన్నాడు. నిమజ్జనం అనంతరం తెల్లవారుజామున 2గంటలకు ఇంటికొచ్చి నిద్రపోయారు. శంకర్ ఉదయం ఎంతకూ గదినుంచి బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు తలుపులు తెరిచి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. ఘటనపై ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడును వివరణ కొరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మృతదేహం వెలికితీత..


జైపాల్(ఫైల్)

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్ చెరువులో చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హన్మన్‌పల్లి గ్రామానికి చెందిన తెలుగు జైపాల్(32) మంగళవారం కిష్టాపూర్ గ్రామం వద్ద ఉన్న రామసముద్రం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. గురువారం రాత్రి మృతదేహం బయటపడింది. శుక్రవారం పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

గల్లంతైన వ్యక్తి శవం లభ్యం

నవాబుపేట: మూడు రోజుల కిందట చేపల వేటకు వెళ్లిన వ్యక్తి చెరువులో మునిగి గల్లంతైన వ్యక్తి శుక్రవారం శవమై కన్పించాడు. దేపల్లికి చెందిన మహ్మద్ జావిద్(35)గ్రామానికి చెందిన బుచ్చయ్యతో కలిసి గ్రామ సమీపంలో ఉన్న చెరువులో చేపల పట్టేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు చేపల వలలో చిక్కుకోవడంతో నీటిలో మునిగాడు. గ్రామస్తులు వెతికిన ఆచూకీ లభించకపోవటంతో పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించారు. రెండు రోజుల పాటు గాలించి ఎట్టకేలకు జావిద్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య అన్వీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడికి నలుగురు పిల్లలు ఉన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆత్మకూర్: రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి శ్రీరాంనగర్ రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ప్రయాణిస్తున్న రైలు నుంచి జారిపడి రైలు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తెలుపు రంగు ఫుల్ చొక్కా, బ్లాక్ జీన్స్ ప్యాంటు వేసుకున్నాడని తెలిపారు. మృతదేహాన్ని గద్వాల మార్చురీకి తరలించినట్లు వివరించారు. ఎవరికైన వివరాలు తెలిస్తే సెల్: 83412 52529 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అట్టహాసంగా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్


మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

- 11వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలు
- టోర్నీని ప్రారంభించిన ఎమ్మెల్యే
- ఉత్కంఠంగా మెయిన్ డ్రా మ్యాచ్‌లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంలో 11వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల (అండర్-13) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో మెయిన్ డ్రా మ్యాచ్‌లు ఉత్కంఠ భరితంగా జరిగాయి.

తొలిరోజు ఫలితాలు

బాలుర సింగిల్స్‌లో పబ్బు శివంశ్ (మేడ్చల్) 15-8, 15-8 సెట్ల తేడాతో ఈకాంశ్ (వరంగల్)పై, రిషిశ్రీరాం (మేడ్చల్) 15-6, 15-3 తేడాతో ఆరుష్ నడింపల్లిపై, అద్వైత్ సత్తు (వికారాబాద్) 15-6, 15-7 తేడాతో అభినిత్ అసోల్లపై, కార్తీకేయ (రంగారెడ్డి) 15-9, 15-8 తేడాతో జార్జి నిశ్చయ్‌పై, బాలికల సింగిల్స్‌లో అభజాదవ్ (రంగారెడ్డి) 15-8, 15-9 తేడాతో వేదితరెడ్డి (వరంగల్)పై, దియా ఆనంద్(వికారాబాద్) 10-15, 15-6, 15-12 తేడాతో జోవిత దేబ్‌నాథ్‌పై, అన్విరెడ్డి (సూర్యాపేట)15-1, 15-1 తేడాతో ప్రకృతి (భద్రాద్రి)పై గెలుపొందింది. పలువురు క్రీడాకారులు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎన్పీ వెంకటేశ్ తదితరులు

ఎమ్మెల్యే అసహనం

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఫ్లెక్సీలో ఫొటోల ప్రొటోకాల్ విషయంలో నిర్వాహకులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. టోర్నీ వేదికపై ఉన్న ఫ్లెక్సీలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఫొటో ఎందుకు పెట్టలేదని, అదే విధంగా ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడి ఫొటోలు పెట్టకపోవడంపై అసహసనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వసతుల్లో టోర్నమెంట్‌లు నిర్వహిస్తే ఖచ్చితంగా ప్రొటోకాల్ పాటించాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 7 వ తేదీ వరకు నిర్వహించనున్న చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు పాల్గొనున్నట్లు తెలిపారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారులకు అన్ని రకాల వసతులు కల్పించి టోర్నీని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు ప్రత్యేక కోచింగ్ ఇచ్చి వారి నైపుణ్యాన్ని వెలికితీయడానికి నూతన క్రీడా పాలసీ తీసుకొచ్చినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ స్టేడియంలో క్రీడాభివృద్ధి కోసం ఇటీవల రూ.16.50 కోట్లు కేటాయించామన్నారు. త్వరలో క్రీడాశాఖ మంత్రితో క్రీడాభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఇండోర్ స్టేడియంలో ఏసీ, స్పోర్ట్స్ హాస్టల్ నిర్మాణంతో పాటు మూడు, నాలుగు క్రీడలను ఎంపిక చేసుకొని క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి జాతీయస్థాయిలో చాంపియన్లుగా తీర్చిదిద్దడానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్, కురుమూర్తిగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, టోర్నీ పరిశీలకుడు సుధాకర్, రెఫరీ కిషోర్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, రవికుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శులు నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు 76,800 క్యూసెక్కుల వరద


జూరాల జలాశయంలో ప్రస్తుత నీటిమట్టం

4 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు/ఆత్మకూర్/రాజోళి/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం 92 వేల క్యూసెక్కులు ఉండగా... శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో 76,800 క్యూసెక్కులకు చేరినట్లు వివరించారు. దీంతో ప్రాజెక్టు 4 క్రస్ట్‌గేట్లను పైకెత్తి 27,504 క్యూసెక్కులు దిగువకు, విద్యుదుద్పత్తి నిమిత్తం 41,602, ఆవిరి రూపంలో 67, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 620, భీమా లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు వినియోగించినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.261 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి..

జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఉత్పత్తి కొనసాగుతోంది. మే నెలలోనే విద్యుదుత్పత్తి ప్రారంభించగా.. శుక్రవారం నాటికి 597 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించారు. కాగా ఈ ఏడాది లక్ష్యంగా 610 మి.యూ.గా ఉంది. శుక్రవారం ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 285.025 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 311.995 మి.యూ. ఉత్పత్తి చేపట్టామని ఎస్‌ఈ శ్రీధర్ వివరించారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద

సుంకేసుల జలాశయానికి శుక్రవారం ఎగువ నుంచి 54 వేల క్యూసెక్కుల వరద రాగా.. 12 గేట్లను మీటర్ మేర తెరిచి 50,484 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర వివరించారు. అలాగే 2,626 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు పేర్కొన్నారు.

శ్రీశైలం ఆనకట్ట గేట్లు మూసివేత..

ఎగువ నుంచి వస్తున్న ప్రవాహం శుక్రవారం తగ్గుముఖం పట్టడంతో ఆనకట్ట గేట్లను మూసివేశారు. జూరాల స్పిల్‌వే నుంచి 27,504 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 41,602 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 46,277 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరింది. శ్రీశైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,012 క్యూసెక్కులు దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 883.8 అడుగుల నీటిమట్టం.. 208.7210 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 32 వేల క్యూసెక్కులు, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,824, ఎంజీకేఎల్‌ఐకు 682 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.084 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.295 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టారు.

యూరియా చల్లేందుకు వెళ్లి వ్యక్తి మృతి


ఎండీ మైను (ఫైల్)

గోపాల్‌పేట: యూరియా చల్లేందుకు కూలీకి వెళ్లిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని నాగపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. రేవల్లి ఎస్‌ఐ రజిత కథనం ప్రకారం.. నాగపూర్ గ్రామానికి చెందిన ఎండీ మైను(49) కుటుంబ పోషణ కోసం కూలీ పనులకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం అదే గ్రామానికి చెందిన మధుకర్‌రెడ్డి పొలంలో యూరియా చల్లేందుకు మైను మద్యం తాగి కూలీకి వెళ్లాడు. యూరియా చల్లుతుండగా బోర్లా పడ్డాడు. కొద్దిసేపు ఎవరూ గమనించకపోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మైను భార్య నూర్జహాన్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న వానరాలు

- వారం వ్యవధిలో పది మందిపై దాడి


వానరం దాడిలో గాయపడిన సహస్ర

మద్దూరు: పట్టణంలో కోతుల దాడులతో భయాందోళన చెందుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. వారం వ్యవధిలో 10 మందిపై దాడి చేసినట్లు తెలిపారు. శుక్రవారం కోతుల దాడిలో సహస్ర(5), దాసరి అనిత(25), లక్ష్మి(30), హన్మంతు (35), ఆశమ్మ(60)పై దాడి చేసినట్లు పేర్కొన్నారు. గాయపడిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పాన్‌గల్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై శుక్రవారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన కావలి రమేష్(25)కు మూడేళ్ల క్రితం వీపనగండ్ల మండలం కల్వరాలకు చెందిన సువర్ణతో వివాహం జరిగింది. రమేష్ తాగుడుకు బానిస కావడంతో సువర్ణ తల్లి గారింట్లో ఉంటుంది. ఈ క్రమంలో భార్య కాపురానికి రావడం లేదన్న మనస్థాపంలో ఉంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 1న పాన్‌గల్ ప్రాథమిక పాఠశాల సమీపంలో వెల్డింగ్ షాపు దగ్గర నోటి నుంచి నురుగులు కక్కుతూ పడి ఉండటాన్ని గమనించిన గ్రామస్తులు 108 అంబులెన్స్‌లో జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబునగర్ ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. భార్య కాపురానికి రాలేదనే మనస్థాపంతో చనిపోయాడని మృతుడి తండ్రి కావలి బాలస్వామి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నిమజ్జనం చేసి వస్తుండగా..అపశ్రుతి

- జాతీయ రహదారిపై ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొన్న డీసీఎం
- అర్ధరాత్రి పెబ్బేర్ మండలం రంగాపురం వద్ద ప్రమాద ఘటన
- ఒకే గ్రామానికి చెందిన ఇద్దరి దుర్మరణం, మరొకరి పరిస్థితి విషమం
- వనపర్తి మండలం నాచహళ్లిలో మిన్నంటిన కుటుంబ సభ్యుల రోధనలు


ప్రమాదానికి కారణమైన డీసీఎం

వనపర్తి రూరల్: కృష్ణానదిలో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేసి ట్రాక్టర్‌పై వస్తుండగా.. వెనుక నుంచి వేగంగా వస్తున్న డీసీఎం ఢీకొట్టడంతో అక్కడిక్కడే ఇద్దరు దుర్మరణం చెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా కాగా.. నలుగురికి గాయాలైన ఘటన పెబ్బేరు మండలం రంగాపురం జాతీయ రహదారిపై శక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పెబ్బేరు ఎస్‌ఐ యుగేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. వనపర్తి మండలం నాచహళ్లికి చెందిన సాయితేజ(25), శంకర్(26) అదే గ్రామానికి చెందిన ఎనిమిది మందితో కలిసి గ్రామంలోని కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాన్ని బీచుపల్లి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేయడానికి ట్రాక్టర్‌లో బయలుదేరారు. నదిలో వినాయకుడిని నిమజ్జనం చేసి తిరిగి వస్తుండగా రంగాపురం శివారులోని జాతీయ రహదారిపై వస్తుండగా అనంతపూర్ జిల్లా నుంచి టమోటా లోడుతో హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టింది. డ్రైవర్ నరేశ్, సాయితేజ, శంకర్, విష్ణు, అబ్దుల్లా ముందుభాగంలో కూర్చోగా.. మిగతా వారు ట్రాలీలో కూర్చున్నారు. ముందుభాగంలో కూర్చున్న సాయికృష్ణ, శంకర్, డీసీఎం కింద పడడంతో అక్కడిక్కడే మృతిచెందారు. విష్ణు, అబ్దుల్లా రోడ్డుపై పక్కకు పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఇంజన్‌తోపాటు ట్రాలీ 300 మీటర్లు దూరం దూసుకెళ్లి డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. ట్రాలీలో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని అంబులెన్సులో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన విష్ణు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు హైదారాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అబ్దుల్లా తలకు తీవ్ర గాయం కాగా.. మిగతా వారికి స్వల్ప గాయాలతో వనపర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి ఆవరణలో మృతుల బంధువులు, గ్రామస్తులు చేరుకోవడంతో పరిసరాలు ఆర్తనాదాలతో నిండిపోవడంతో పలువురిని కలిచి వేశాయి. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


సాయితేజ (ఫైల్)


శంకర్ (ఫైల్)

గ్రామంలో విషాదఛాయలు

వినాయకుడి నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకొని గ్రామంలో ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బోయ శ్రీనివాసులు, భార్య మొగులమ్మకు సాయితేజ ఒక్కరే సంతానం కావడంతో ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో వారి రోధనలు మిన్నంటాయి. సాయితేజకు వివాహమై భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. గోవిందుకు ముగ్గురు కుమారులుండగా.. రెండో కుమారుడైన శంకర్ మృతితో కుటుంబం, బంధువుల రోధనలు పలువురిని కంటతడి పెట్టించాయి. శంకర్‌కు వివాహం కాలేదు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డితోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర నాయకులు అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకొని మృతులకు నివాళులర్పించి బాధిత కుంటుబాలను పరామర్శించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



వనపర్తి రూరల్: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శ్రీరంగాపురం మండలం శేరుపల్లిలో శుక్రవారం జరిగింది. శ్రీరంగాపురం ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు.. శేరుపల్లికి చెందిన వెంకటయ్య ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి పొలం దగ్గరకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరచి ఉంచడాన్ని గమనించారు. రూ.80 వేల నగదు 2.7 తులాల బంగారం చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బల్మూర్: మండలంలోని బాణాల గ్రామానికి చెందిన సంపంగి పార్వతమ్మ(28) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాలు.. ఎనిమిదేళ్ల కిందట నల్లగొండ జిల్లా నేరోడిగోమ్‌కు చెందిన నరేష్‌తో పార్వతమ్మకు వివాహమైంది. భార్య ప్రవర్తనపై భర్త మందలించాడు. దీంతో మనస్తాపానికి గురై ఆమె గురువారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

గట్టులో అతి చిన్న 'ఖురాన్'



అతిపురాతన, అరుదైన రెండు అతి చిన్న పవిత్ర ఖురాన్ గ్రంథాలను శుక్రవారం ముస్లిం సోదరులు మండల కేంద్రంలో బయటకు తీశారు. వీటిని వారు తమ తరతరాల వారసత్వ సంపదగా భావిస్తూ భద్రపర్చారు. జామీయా మసీదుతో పాటు బిచ్చాలపేటలోని మసీద్‌లో ఈ గ్రంథాలున్నాయి. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఈ రెండు అరుదైన గ్రంథాలను ప్రత్యేక ప్రార్థనల అనంతరం బయటకు తీశారు. ఈ గ్రంథాలను దర్శించుకుంటే పుణ్యం కలుగుతుందని ఇక్కడి ముస్లింలు నమ్ముతారు. అగ్గిపెట్టెలో ఇమిడే అతి చిన్న అరుదైన పురాతన పవిత్ర గ్రంథాలు రెండు ఉండగా.. సుమారు 244 ఏళ్ల నాటివిగా చెబుతున్నారు. అతి చిన్న ఖురాన్ గ్రంథంలో మొత్తం 480 పేజీలు.. 30 పారే (పర్వాలు) ఉన్నట్లు ముస్లిం పెద్దలు తెలిపారు. ఇందులోని అక్షరాలు భూతద్దంతో చూస్తేనే కనిపిస్తాయి. ఈ గ్రంథాలను దర్శించుకునేందుకు కర్ణాటకలోని రాయచూర్, యరగెరతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ముస్లింలు తరలివచ్చారు. కొద్ది నిమిషాలు మాత్రమే సందర్శనార్థం బయటకు తీసి తిరిగి భద్రపర్చారు. నూతన వస్త్రంతో భద్ర పర్చితే, కోర్కెలు నెరవేరుతాయని ఇక్కడి ముస్లింల నమ్మకం.

\- గట్టు

కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా


చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరభాస్కర్


అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరభాస్కర్

అమరచింత: రాష్ట్రంలోని చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేవిధంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరభాస్కర్ తెలిపారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి శుక్రవారం అమరచింతకు వచ్చిన ఆయన భక్త మార్కండేయ ఆలయంలో చేనేత కార్మికులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పరంగా చేనేత కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. చాలామంది కార్మికులు మగ్గాలపై జరీ చీరలను తయారు చేస్తున్న నేటికీ జౌళిశాఖ అధికారులు జియోట్యాగ్ నంబర్లను ఇవ్వకపోవడంతో పథకాలకు కార్మికులు దూరమవుతున్నారని తెలిపారు. పక్కనున్న జోగుళాంబ గద్వాల జిల్లాలో మగ్గానికి ముగ్గురు కార్మికులకు నేతన్నకు చేయూత పథకాన్ని వర్తింపజేశారని, ఇక్కడమాత్రం మగ్గానికి ఇద్దరు కార్మికులనే ఎందుకు పరిమితం చేశారో అర్థం కావడం లేదన్నారు. చేనేత సహకార సంఘాలను బలోపేతం చేస్తూ కార్మికులు రాయితీలను పొందేలా ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి కార్మికులు లబ్ధిపొందేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్రస్థాయి చేనేత అవార్డులను అందుకున్న పట్టణానికి చెందిన దేవరకొండ లచ్చన్న, మహంకాళి సులోచనను సన్మానించారు. కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సత్యన్న, నాగరాజు, చింతన్న, రాములు, సత్తి, కురుమన్న, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయాల మూసివేత

అలంపూర్: చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని ఆలయాలను ఆదివారం మూసివేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివార్ల ఆలయ తలుపులు మూసివేస్తామని ఆలయ ఈఓ దీప్తి, కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తుల దర్శనాలు సైతం కొనసాగుతాయని, పౌర్ణమిని పురస్కరించుకొని జోగుళాంబ ఆలయంలో చండీ హోమాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం నుంచి ఉభయ ఆలయాల తలుపులు మూసివేసి.. సోమవారం ఉదయం ఆలయాల సంప్రోక్షణ తర్వాత 8.30 గంటలకు మహా మంగళ హారతితో ఉభయ ఆలయాల తలుపులు తెరిచి భక్తుల దర్శనాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.


అలంపూర్ క్షేత్ర ఆలయాలు

మన్యంకొండ ఆలయం..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: చంద్రగ్రహణం కారణంగా మన్యంకొండలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు మూసి (ద్వార బంధనం) వేయనున్నట్లు దేవస్థానం చైర్మన్ అలహరి మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి సంప్రోక్షణ, అభిషేకం తర్వాత సోమవారం ఉదయం 9 గంటల నుంచి భక్తులు తిరిగి దర్శనం చేసుకోవచ్చన్నారు.

తండ్రిని చితకబాది కారు డిక్కీలో తీసుకెళ్లిన కుమారుడు

- డిండిచింతలపల్లి వద్ద వాగులో పడేసినట్లు గుర్తింపు
- డిండి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పొలాల వద్ద దొరికిన మృతదేహం


వంగూరు మండలం డిండి చింతపల్లి వద్ద గాలిస్తున్న పోలీసులు

కల్వకుర్తి టౌన్: కొడుకు చేతిలో దారుణ హత్యకు గురైన బాలయ్య(70) మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని వాసవీనగర్‌కు చెందిన బాలయ్యను బుధవారం సాయంత్రం ఆయన కుమారుడు తండ్రిని తీవ్రంగా కొట్టి కారు డిక్కీలో వేసుకుని వెళ్లిన విషయం తెలిసిందే. సీసీ కెమెరాలను పరిశీలించగా కుమారుడు బీరయ్యనే దాడి చేసి కారులో తీసుకెళ్లినట్లు గుర్తించి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బాలయ్య మృతదేహాన్ని మండలంలోని డిండిచింతపల్లి వద్ద బ్రిడ్జిపై నుంచి అక్కడ ఉన్న వాగులో పడేసినట్లు గుర్తించి.. శుక్రవారం ఉదయం నుంచి కల్వకుర్తి సీఐ నాగార్జున ఆధ్వర్యంలో ఎస్‌ఐలు మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేష్ ఆధ్వర్యంలో డ్రోన్, గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చేపట్టారు. చివరకు ఉప్పునుంతల మండలం కొరటికల్ వద్ద డిండి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వెంట పొలాల వద్ద ఉండే వారు మృతదేహం ఒడ్డుకు వచ్చిందని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా.. బాలయ్య మృతదేహంగా గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎక్కడకు తరలించాలన్న విషయాన్ని గురించి పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు తరలిస్తామని పోలీసులు తెలిపారు. తండ్రిని హత్య చేసిన బీరయ్య ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడని, అతనికి సహకరించిన బీరయ్య బావమరిది సైతం అదుపులో ఉన్నాడని సమాచారం. అయితే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


బాలయ్య (ఫైల్)

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED
త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18K. Ph: 9640400073, 9160900024

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
© 9553955603
మహబూబ్‌నగర్ : 9705135557, 9010869797
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9553955603
గద్వాల : 9398469650
నారాయణపేట : 9010962007

భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటి నిజాయితీని పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రేటు క్లెయిమ్ చేసే దానితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజ్‌మెంట్